# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 05-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలో భాగంగా ఈరోజు అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌కు చేరుకున్నారు.
- భారతదేశాన్ని 2047 నాటికి 32 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తామని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ అన్నారు.
- దేశంలో మొట్టమొదటి సహకార విశ్వవిద్యాలయాన్ని గుజరాత్ లో హోంమంత్రి అమిత్ షా ఈరోజు ప్రారంభించారు.
- జార్ఖండ్ లోని ఒక బొగ్గు గనిలో ఈరోజు జరిగిన ప్రమాదంలో నలుగురు మృతి చెందారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ట్రినిడాడ్ & టొబాగో పర్యటనను విజయవంతంగా ముగించుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌కు చేరుకున్నారు. ప్రధాని మోదీకి అర్జెంటీనా భారతీయ సమాజం నుండి ఘన స్వాగతం లభించింది. అర్జెంటీనా స్వాతంత్ర్య సమరయోధుడు జనరల్ ఒసే డే సాన్ మార్టిన్ విగ్రహం వద్ద ప్రధానమంత్రి నివాళులు అర్పించారు. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, పరస్పర సహకారానికి నూతన మార్గాలను అన్వేషించడానికి ప్రధానమంత్రి ప్రతినిధి బృందం స్థాయి చర్చలు జరపనున్నారు. అనంతరం బ్రెజిల్ లోని రియో డి జనీరో నగరంలో రేపు జరగనున్న బ్రిక్ శిఖరాగ్ర సమావేశంలో ప్రధానమంత్రి పాల్గొనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశాన్ని 2047 నాటికి నాలుగు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ నుండి 32 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడానికి వ్యూహాత్మక విధానాలు రూపొందించామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పియూష్ గోయల్ అన్నారు. బెంగళూరులో ఈరోజు జరిగిన ఐఐటీ మద్రాస్ 'సంగం 2025' గ్లోబల్ ఇన్నోవేషన్, పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మంత్రి ప్రసంగించారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూపొందించిన విధానాలు భారతదేశాన్ని ప్రపంచంలోనే నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఇప్పటికే నిలిపాయని, 2028 నాటికి దేశం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో భారత్ ఒకటని, సాంకేతికతను స్వీకరించి కృత్రిమ మేధస్సు, క్వాంటం కంప్యూటింగ్ తదితర రంగాలలో భారతదేశం నాయకత్వం వహిస్తుందని వివరించారు. డీప్ టెక్ పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి గత బడ్జెట్‌లో 10,000 కోట్ల రూపాయలు కేటాయించబడిందని మంత్రి పీయూష్ గోయల్ పేర్కొంటూ..

(వాయిస్ బైట్...35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా ఈరోజు గుజరాత్‌లోని ఆనంద్ నగరంలో దేశంలోని మొట్టమొదటి సహకార విశ్వవిద్యాలయం త్రిభువన్ సహకారి విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన

మాట్లాడుతూ.. కోట్లాది మంది పేదలు, గ్రామీణ ప్రజల జీవితాల్లో నూతన ఆశలను నింపడానికి సహకార మంత్రిత్వ శాఖ స్థాపించబడిందని, గత నాలుగు సంవత్సరాలలో ఆ మంత్రిత్వ శాఖ 60 కొత్త కార్యక్రమాలను ప్రారంభించిందని అన్నారు. దాదాపు 40 లక్షల మంది కార్మికులు సహకార ఉద్యమంలో చేరిందని వెల్లడించారు. ఈ విశ్వవిద్యాలయం సహకార రంగంలో విధాన రూపకల్పన, డేటా విశ్లేషణ, సహకార అభివృద్ధి వ్యూహాలు, పరిశోధన వంటి పనులను చేస్తుందని అమిత్ షా వెల్లడిస్తూ..

(వాయిస్ బైట్...35 సెకన్లు)

==============================

జార్ఖండ్, రాంగఢ్ జిల్లాలోని మహువా తుంగ్రిలో ఈరోజు పాడుబడిన బొగ్గు గనిలో ఒక భాగం కూలిపోవడంతో శిథిలాల కింద చిక్కుకుని నలుగురు వ్యక్తులు మరణించారు. సెంట్రల్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్ (సిసిఎల్) ప్రాజెక్ట్‌లో అక్రమ మైనింగ్ సమయంలో ఈ ప్రమాదం జరిగింది. శిథిలాల కింద చిక్కుకున్న మొత్తం పది మందిలో ఆరుగురిని సహాయక బృందాలు సజీవంగా బయటకు తీసుకువచ్చాయి. రక్షించబడిన వారందరి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆసుపత్రిలో చేర్పించారు. ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాంగఢ్ డిప్యూటీ కమిషనర్ ఫైజ్ అక్ అహ్మద్ తెలిపారు.

==============================

విరామం

==============================

దేశంలోని సామాన్య ప్రజలకు ఉత్తమ వైద్య సదుపాయాలను అందించడంలో ఆయుష్మాన్ భారత్ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉందని కేంద్ర సమాచార, ప్రసారశాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ అన్నారు. ఈరోజు తిరువనంతపురంలో శ్రీ ఉత్రాడోం తిరునాల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ 14వ స్నాతకోత్సవాన్ని ప్రారంభిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గత 10 సంవత్సరాలలో దేశంలో వైద్య కళాశాలల సంఖ్య 387 నుండి 776కి పెరిగిందని అన్నారు. భారతదేశంలో ఆరోగ్య వ్యవస్థ అంతర్జాతీయ ప్రమాణాల స్థాయిలో ఉందని ఆయన పేర్కొన్నారు.

==============================

అమర్‌నాథ్ యాత్రకు వెళ్తోన్న బస్సులకు ఈరోజు జరిగిన ప్రమాదంలో 36 మంది యాత్రికులు గాయపడ్డారు. వరుసగా ఒకదానితొకటి ఐదు బస్సులు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. జమ్మూకశ్మీర్ లోని రాంబన్ జిల్లా చందర్‌కోట్ వద్ద పహల్గాం బేస్ క్యాంప్‌నకు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. క్షతగాత్రులను రాంబన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. యాత్రికులు అల్పాహారం చేయడం కోసం చందర్‌కోట్ వద్ద వాహనాలు నిలిపిఉంచారు. అప్పుడే ఒక బస్సు నియంత్రణ కోల్పోయి, ఆగిఉన్న వాటిని ఢీకొట్టింది. దాంతో వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో యాత్రికులు గాయపడ్డారు.

==============================

న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఇన్నోవేటివ్ ఫిజిషియన్ ఫోరం 7వ వార్షిక అంతర్జాతీయ సమావేశాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రారంభించారు. భారత్, నేపాల్, శ్రీలంక, మలేషియా, బ్రిటన్ దేశాలకు చెందిన వైద్యులు, పరిశోధకులు పాల్గొన్న ఈ సమావేశంలో ఓం బిర్లా మాట్లాడుతూ.. అభివృద్ధి చెందుతున్న భారతదేశ ఆరోగ్య విధానం, వైద్య ఆవిష్కరణలు గూరించి ప్రస్తావించారు. వైద్య విద్య, పరిశోధనలో ప్రపంచ సహకారం ఎంతో అవసరమని ఈ సందర్భంగా ఆయన పేర్కొంటూ..

(వాయిస్ బైట్...30 సెకన్లు)

==============================

ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం తెలిపారు. మృతుల బంధువులకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (PMNRF) నుండి 2 లక్షల రూపాయలు, గాయపడిన వారికి 50 వేల రూపాయలు చొప్పున నష్టపరిహారాన్ని ప్రకటించారు. సంభాల్ లోని మీరట్-బదౌన్ జాతీయ రహదారిపై నిన్న ఓ రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక వివాహ బృందంలోని 10 మందితో ప్రయాణిస్తున్న కారు, కళాశాల గోడను ఢీకొట్టిన ప్రమాదంలో వరుడు సహ ఐదుగురు మరణించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉపరాష్ట్రపతి జగదీప్ ధనఖర్ రేపటి నుండి రెండు రోజులు కేరళ రాష్ట్రంలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా త్రిస్సూర్ జిల్లాలోని గురువాయూర్ ఆలయంలో సోమవారం ఆయన ప్రార్థనలు చేయనున్నారు. మరుసటి రోజు కొచ్చిలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ (NUALS) విద్యార్థులు, అధ్యాపకులతో ఉపరాష్ట్రపతి సంభాషించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్ బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న రెండవ టెస్ట్ మ్యాచ్ రెండవ ఇన్నింగ్స్ లో భారత్ ఇంగ్లాండ్ కు భారీ లక్ష్యాన్ని నిర్దేశిస్తోంది. 77 పరుగుల ఓవర్ నైట్ స్కోర్ తో నాల్గవ రోజుని ఆరంభించిన భారత జట్టు టీ విరామ సమయానికి 4 వికెట్లు కోల్పోయి 304 పరుగులు చేసింది. దీంతో తొలి ఇన్నింగ్స్ లోని 180 పరుగుల ఆధిక్యంతో కలిపి భారత్ ఇప్పటి వరకు 484 పరుగులు చేసింది. కెప్టెన్ శుభమన్ గిల్ మరో సెంచరీ చేసి రికార్డు నెలకొల్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ బ్యాంకు భారతదేశాన్ని ప్రపంచంలోని అత్యంత సమాన సమాజాలాలలో ఒకటిగా నిలిపింది. ప్రపంచ బ్యాంకు ప్రకారం, భారతదేశ జెనీ ఇండెక్స్ స్కోరును 25.5గా లెక్క కట్టారు. ఒక దేశంలోని గృహాలు లేదా వ్యక్తులలో ఆదాయం, సంపద లేదా వినియోగం ఎలా సమానంగా పంపిణీ చేయబడుతుందో అర్థం చేసుకోవడానికి జెనీ ఇండెక్స్ అనేది ఒక సరళమైన, శక్తివంతమైన పద్ధతి. ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన వివరాల ప్రకారం 167 దేశాల కంటే భారతదేశం మెరుగైన స్కోరును కలిగి ఉంది. చైనా ఇండెక్స్ స్కోరు 35.7 కాగా, అమెరికా ఇండెక్స్ స్కోరు 41.8 స్కోరుతో భారత్ కంటే ముందు ఉన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాబోయే ఏడు రోజుల్లో వాయువ్య, ఈశాన్య, పశ్చిమ, తూర్పు, మధ్య దక్షిణ భారతదేశంలో ఉరుములు, ఈదురుగాలులు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ(IMD) తెలిపింది. ఇదిలా ఉండగా.. హిమాచల్ ప్రదేశ్‌లో, నైరుతి రుతుపవనాలు మరింత తీవ్రతరం కావడంతో, ఈ నెల 9 వరకు ఆ రాష్ట్రంలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని సిమ్లాలోని వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. రానున్న రెండు రోజులు వర్షాలు గరిష్ట స్థాయికి చేరుకుంటాయని, వీటి కారణంగా కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని, నివాసితులు అప్రమత్తంగా ఉండాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =